ఆదర్శం

యర్రమిల్లి విజయలక్ష్మి

"రావే.....రా.....రా..... ఎప్పుడొచ్చావు?" అంటూ మిత్రురాల్ని ఆప్యాయంగా ఆహ్వానించింది రమ.

"రాత్రి వచ్చాం...ఎలావున్నావే.... కులాసానా" నవ్వుతూ రమ ఇంట్లోకి నడిచి ఆమె చూపించిన కుర్చీలో కూర్చుంది లలిత. కొత్త కరిష్మా కాటన్ జరీ చీర మడతలు నలగకుండా సర్దుకుని–"చాలా రోజులైంది నిన్ను చూసి... క్రిందటి నెలలోనే వస్తావని చెప్పారు మీ అమ్మగారు- అక్కడ మీ వాళ్ళంతా బాగున్నారా?"

"ఆఁ అంతా బాగానే వున్నారు..." అని అనాసక్తంగా బదులిచ్చి... సుతారంగా ముక్కు విరిచి.... "అబ్బా....! ఎలా వుంటున్నావే రమా... ఈ కొంపలో...." అంది పాత సామాన్లతోనూ- ధాన్యం బస్తాలతోనూ మరీ ఇరుగ్గా కనిపిస్తున్న గదిని అదోలా చూస్తూ.

సరిగా అప్పుడే రమ ఆడబిడ్డ లక్ష్మి....."వదినా.....కాఫీ..." అంటూ ట్రేలో కాఫీ కప్పులుంచుకుని వచ్చింది. లలిత మాటలు లక్ష్మి ఎక్కడ విందోనని కలవరపడింది రమ... "ఆఁ...లలితా...కాఫీ తీసుకోవే.... మా లక్ష్మి కాఫీ చాలా బాగా చేస్తుంది....." అంది నవ్వు తెచ్చుకుని.

"ఆహా.... అల్లాగా?" అంది లక్ష్మిని తేరిపారచూస్తూ... "ఈ అమ్మాయి మీ రెండో ఆడబిడ్డకదూ.... ముగ్గురు కదూ ఆడపిల్లలు.....?" అంది తళ, తళ శుభ్రంగా మెరుస్తున్న కప్పుచూసి కాస్త సంతృప్తి చెందుతూ....

"అవును....లక్ష్మి క్రితం సంవత్సరమే బియ్యే పూర్తి చేసింది. మంచి సంబంధం దొరికితే పెళ్ళిచెయ్యాలని చూస్తున్నారు..... నీ దృష్టిలో ఎవరన్నా మంచి పిల్లాడుంటే చెప్పవే."

వదిన మాటలకి సిగ్గుపడుతూ లోపలికెళ్ళిపోయింది లక్ష్మి. 'అట్టాగేలే....' అని కాఫీ సుతారంగా సిప్ చేస్తోంది. రమ లలిత వంక విస్మయంగా చూస్తోంది. ఈ లలిత ఎప్పుడూ ఇంతే... పిల్లల తల్లైనా ఏ మాత్రం మారలేదు. ముందు, వెనుక చూసుకోకుండా కుండబద్దలు కొట్టినట్లు అనేస్తుంది.

వేడివేడి కాఫీ తాగేసరికి ఆవిరి కమ్మినట్లు లలిత ముఖానికి చిరుచెమట పట్టింది సుతారంగా కర్చీఫ్‌తో అద్దుకుంటూ.... 'అబ్బా'.... అంటూ ఫ్యాన్ కోసం సీలింగ్ వంక చూసింది.

"దక్షిణపు గది... గాలి బాగానే వస్తుందని ఈ గదిలో ఫ్యాన్ వేయించలేదు.... విసనకర్ర ఇమ్మంటావా....?" స్నేహితురాలికి కలిగిన అసౌకర్యానికి నొచ్చుకుంటూ అంది రమ.

"అయితే... నీ బతుకిక ఈ మురికి కూపానికే అంకితమేమిటే రమా? అబ్బ... హారిబుల్...! ఎలా వుంటున్నావే బాబూ.... ఎంత తెలివిగా వుండేదానివి.... నీకెంతో మంచి ఫ్యూచర్ వుందనుకునేవాళ్లం.... ఎలా తయారయ్యావే బాబూ!" కొత్తగా మెరుస్తున్న ముత్యాల నెక్లెస్ సున్నితంగా సర్దుకుంటూ అంది లలిత. ఆమె చూపులు తన మెడలో పసుపుతాడుని గుచ్చి చూడటం రమకెంతో ఇబ్బంది కలిగించింది.

ఇద్దరూ వొక ఊరి వాళ్ళు. ఒకే స్కూల్లో చదువుకున్నారు. చిన్నప్పట్నించి మంచి స్నేహితులు. ఇంచుమించు పెళ్లిళ్లు కూడా ఒకేసారి జరిగాయి. లలిత భర్త పెద్ద గవర్నమెంట్ కన్సర్న్‌లో ఆఫీసరుగా వుంటే- రమ భర్త అదే ఊళ్లో హైస్కూల్లో మాస్టారుగా పనిచేస్తున్నాడు. కొద్దిపాటి ఆస్తి- ఒక సొంత పెంకుటిల్లు వున్నాయి.

"ఏం చెయ్యమంటావే.... మావగారు రిటైరై పోయారు. వళ్లు కూడా అంత బాగుండటం లేదు... ఈ ఊళ్లో స్థిరపడిపోయారు... అయినా నాకేం లోటు లేదులేవే.. నన్నెంతో ప్రేమగా చూసుకుంటారంతా..." తన జీవితాన్ని గురించి స్నేహితురాలు అసంతృప్తిని వ్యక్తం చేస్తుంటే మెల్లిగా అంది రమ. లలిత మాటలు ఇంట్లో ఎవరన్నా వింటే ఎంత బాధపడతారోనని మనసులో ఖంగారుపడుతోంది. కాని వాళ్లిద్దరూ స్వేచ్ఛగా మాట్లాడుకోవాలని లాగుంది ఇంట్లో ఎవరూ ఆ పక్కకి రావటంలేదు.

"మనకంటూ సుఖం లేకపోయాక ఇంకెందుకు...? ఇంకా నయం.... నేను అదృష్టవంతురాల్ని. ముందే తెలిసుండబట్టి- పెళ్లికి ముందే చెప్పేసాను ఆయనకి. మంచిసిటీకి బదిలీ చేయించుకోమని! నీకు తెలుసుగా మా పెళ్లినాటికి తను వాళ్ల ఊళ్లోనే ఉద్యోగం చేస్తుండేవారు... అయినా రమా... అనుభవించవలసిన వయసులో, హాయిగా స్వేచ్ఛగా నాలుగు సిటీలు తిరక్క.... ఈ బతుకేమిటి చెప్పు.... కొన్ని, కొన్ని విషయాల్లో మనం చాలా ప్రాక్టికల్‌గా స్పష్టంగా వుండాలి. నా మాట విని మీ అయన్నిక్కడ్నించి బదిలీ చేయించుకోమను. అంతగా కావాలంటే ఏదో నెలకింతని పంపించండి... అంతే కాని బంగారం లాంటి బతుకంతా ఇలా మురికిలో గడిపేస్తారా.. నిజంగా చెప్పు.... ఇక్కడీ ఇంట్లో నువ్వేమన్నా సుఖపడుతున్నావా?"

స్నేహితురాలు విసిరిన సవాలుకి రమ తికమకపడింది... మాట మార్చాలని.... "అవును కాని లలితా! మీ అమ్మగారు పాపం ఇక్కడ వంటరిగా ఇబ్బంది పడుతున్నారే.... మొన్నోసారి వెళ్లి చూసాను... ఆరోగ్యం కూడా అంత బాగా వున్నట్లు లేదు... కాస్త మీ తమ్ముడికి చెప్పకూడదూ... తన దగ్గర వుంచుకోమని."

"ఏమిటి....? నేనా..... వాడికా.... బాగా చెప్పావు.... మునపటి సుభాష్ అనుకున్నావేమిటి...వాడు.... పెళ్ళయ్యాక ఎంత మారిపోయాడంటావు? మా మరదలు మహాజాణలే... మొగుడ్ని కొంగుకి కట్టేసుకుంది. ఆవిడెంతంటే

అంత! మొగుడు పనికొస్తాడు వాడి తల్లి పనికి రాదు. పోనీ ఆడపడుచుని నా విషయం వదిలెయ్... ఎంతైనా వాడి తల్లి కదా... సొంత అత్తగారు కదా ఆవిడంటే నన్న కాస్త అభిమానం వుండొద్దూ.... ఊహూ...." ఉద్రేకంతో ముక్కుపుటాలెగరేస్తూ ముఖమంతా ఎర్రగా చేసుకుని కంప్లైంటు చేసింది.

లలిత ఆవేదన రమ అర్థం చేసుకుంది. అయిన సంబంధం అని సుభాష్‌కి ఏరికోరి చేసుకున్నారు శశిని. ఆ అమ్మాయీ బాగానే చదువుకుంది కాని అదేమిటో అత్తింటి వాళ్లంటే పడదు. మళ్లీ అన్ని విధాలా మంచిగానే వుంటుంది. కాపరానికి వచ్చీరాగానే వేరుకాపురం పెట్టేసారు. వంటరిగా లలితా వాళ్ల ముసలితల్లి పాత ఇంట్లో పడి వుంటోంది. సుభాష్ ఎప్పుడైనా వస్తే వస్తాడు. లేకపోతే లేదు. చేతికెదిగొచ్చిన కొడుకు నిన్నటి దాకా "అమ్మా....అమ్మా..." అంటూ తన చుట్టూ తిరిగిన బిడ్డ- దూరమై తన్న లక్ష్యం చేస్తుంటే కనీస బాధ్యతను మర్చిపోయి తనని వంటరిచేస్తే ఆ తల్లి మనసు విలవిల్లాడిపోతోంది. పైన కొడుకు, కోడలు తనని వంటరిగా వదిలేసి తమ సుఖం తాము చూసుకొంటున్నారని ఊళ్ళోఅంతా విమర్శిస్తుంటే మరీ బాధపడుతోంది. ఆ దిగులు తోనే మంచం పట్టింది. ఇదంతా తెలుసున్న రమ మాటల సందర్భంలో లలితను కదిల్చింది. ఆమె సమాధానం విని మరేమీ మాట్లాడలేకపోయింది. లలిత మాట మార్చి- "ఎంతకాలం ఈ మురికిలో పడుంటావే రమా... నా మాట విని మీ ఆయన్ని ఏదన్నా మంచి సిటీకి బదిలీ చేయించుకోమను. ఎంతైనా సిటీ లైఫ్ వేరు. అనుభవించవలసిన వయసులో హాయిగా వుండక ఇప్పట్నించీ ఈ బాధ్యతలేమిటి...? అవునూ... మీ పెద్దాడబిడ్డ

పెళ్ళి చేసారుటగా! మంచి సంబంధమే ఇచ్చారని చెప్పింది మా అమ్మ." అంది ఆరాగా.

"ఊ... ఈ సంవత్సరం. లక్ష్మికి కూడా చెయ్యాలని... డిగ్రీ అయిపోయింది. సంబంధాలు చూస్తున్నారు. మా మరిది రవి తెలుసుగా ఈ మధ్యే ఉద్యోగంలో చేరాడు బ్యాంక్‌లో..."

"పెళ్లి చేస్తారా...?" అంది లలిత.

"ఇప్పుడప్పుడే చేసుకోనంటున్నాడు.... ముందు అన్నగారికి కాస్త రిలీఫ్ ఇవ్వాలట..." అంది నవ్వుతూ రమ.

"ఊహు... బాగానే వుంది... అయితే ఈ ఊరికే అంకితమన్న మాట... నువ్వు.... ష... ఏం చేస్తాం... ఈసారి మా ఆయన్ని బాంబే బదిలీ చేయించుకోమంటున్నాను. ఈ వయస్సులోనే దేశమంతా తిరిగేస్తే తరువాత రిటైరయ్యాక ఎటూ ఇక్కడికే వచ్చేస్తాం... ఇల్లూ-వాకిలి వుంది కదా.... పిల్లల చదువులూ అవీ కూడా బాగుంటాయక్కడ... సరే... మరి వస్తా... రాత్రికే ప్రయాణం... ఆయనకింకా నాల్రోజులు సెలవుందనుకో.... మా పప్పీకి స్కూల్ రీవోపెనింగ్ రేపే.... విమల్‌ని కూడా జాయిన్‌చెయ్యాలి...." మాట్లాడుతూనే గేటు దాటింది లలిత... గుమ్మం దాకా వచ్చి వెళ్లిపోతున్న స్నేహితురాలి వంకచూస్తూ నిలబడింది రమ.

సంవత్సరం ఇట్టే గడిచింది. అత్తింట్లో ఏదో శుభకార్యానికి వచ్చి రెండ్రోజులు పుట్టింట్లో గడిపింది లలిత. ఆ సాయంత్రం



ఆదర్శం

రమ ఇంటికి వచ్చింది. స్నేహితురాల్లిద్దరూ, కబుర్లలో పడ్డారు. లలితలో ఏదో మార్పు ఇట్టే పసికట్టేసింది రమ.

"ఏమిటే లలితా... అలా నీరసంగా వున్నావు... ఒంట్లో బాగుంటోందా.. కొంపదీసి.... మళ్లీ.... " అంటూ నవ్వుతూ ఆగి చిలిపిగా చూసింది.

ఉసూరుమని నిట్టూర్చింది లలిత- నీరసంగా..." అబ్బే.... అదేంకాదే ఈ మధ్య నా ఆరోగ్యం అంత బాగుంటంలేదు. అక్కడి వాతావరణం పడలేదు... పైన ఈ పిల్ల వెధవలు... నా ప్రాణం తీస్తున్నారనుకో...."

"అదేవిటే... ఇద్దరేగా.... అంత అల్లరిచేస్తున్నారా... నీ పిల్లలు...?" అంది రమ స్నేహంగా నవ్వి.

"ఆ చస్తున్నాననుకో.. ఆయన ఆఫీసుకు వెళ్లి రావాలంటే మనం నరసాపురం వెళ్లి వచ్చినట్లే. తెల్లారకట్టే లేచి అన్నీ అమర్చాలి.. మళ్లీ అర్ధరాత్రికే రావటం. పిల్లలొకళ్లు.. అందరికీ అన్నీ టైంకి అమర్చాలి. ఆ ఊళ్లో మన ఊళ్లోలా పనివాళ్లు దొరకరు... అన్ని స్వయంగా చేసుకోవాల్సిందే...?"

లలిత మాటలు వింటూనే నిమ్మరసం తయారుచేస్తోంది రమ... "అయ్యో... పాపం.... అయితే కష్టమేనే..." అంది జాలిగా.

"పైన ఆ వాతావరణం నాకు పడలేదు... ఎప్పుడూ ఏదో ఒకటి...."

"పోనీ మళ్లీ ట్రాన్స్‌ఫర్ చేయించుకోలేకపోయారా... ఎక్కడికైనా....." సానుభూతిగా అంది.. ఎప్పుడూ చలాకీగా నవ్వుతూ తుళ్లుతూ బేఫర్వాగా వుండే లలిత మన్నుతిన్నట్లు డల్‌గా వుండడం ఆమెకీ బాధగానే వుంది.

"అదంత తేలికకాదుటే....! ఇక్కడ్నించంటేఇతర రాష్ట్రాలకి తొందరగా బదిలీచేస్తారు. మళ్లీ అట్నించి రావటమంటే... అంత త్వరగారాదు..."

"....పోనీ.... మీ వాళ్లనెవరినైనా తీసుకెళ్లకూడదూ కొన్నాళ్లు... కాస్త సాయంగా వుంటారు."

"ఆఁ ఎవరొస్తారే... మన వాళ్లు... మన వాళ్లు అని మనం అనుకోవటమే తప్ప... ఎవరి గొడవలు వాళ్లవి. మా అత్తగారు పెద్దది అంత దూరం రాలేనంది... మా పెద్దాడబిడ్డకు ఫైనల్ ఎగ్జామ్స్ దగ్గరపడుతున్నాయుట. నాతో చనువుగా మాటే మాట్లాడదు. ఇంక అక్కడికేం వస్తుంది."

"పోనీ మీ అమ్మగారు... మరదలు...."

"సరే.... వీళ్ల ముక్కే చెప్పావు... మా అమ్మ అసలే కదిలే పరిస్థితిలో లేదు... ఇక... 'ఆవిడ'గారు అత్తగార్నే పట్టించుకోదు... ఇక నేను కావాలా... తనూ తన సంసారం..." అంతే...."ఊఁ వస్తానే... సామాను సర్దుకోవాలి." అంటూ లేచింది. పరిస్థితులు మనిషిని మార్చినా.... ఆలోచన, అవగాహన పెరగలేదు. తనలోని లోపాన్ని గ్రహించలేక- ఎంతసేపూ ఇతరులలోని తప్పులు వెదుకుతోంది. తన సమస్యలే కాని వాళ్ల సమస్యలు అర్థం చేసుకోలేక పోతోంది. వాళ్ల దృష్టితో ఆలోచించలేకపోతోంది... "లల్లీ... ఒక్క మాట...నీ మరదలు- ఆడబిడ్డ వాళ్లు నిన్ను 'ఆదర్శం'గా తీసుకుంటున్నారేమో... నువ్వు మారు.... వాళ్లూ మారతారు అందరికీ సంతోషంగా వుంటుంది..." అనకుండా వుండలేకపోయాను. గేటు దాటుతున్న లలిత క్షణం ఆగి విస్మయంగా నా వంక చూస్తోంది. అలా చెప్పినందుకు ఎక్కడ నా మీద విరుచుకుపడుతుందోనని భయపడుతున్న నాకు... ఆమె చూపుల్లో...ఏదో ఆలోచన.. కొత్తగా... మెరుస్తూ.... ○